
# మనిషితనం

సి.ఎస్. చంద్రశేఖర్

అలారం మ్రోగించుకొంటూ అంబులెన్స్ వచ్చి ఆ ఆసుపత్రి ముందు ఆగింది. అందులోని మనుషులు దిగి డోర్ తెరచి లోపల స్ట్రెచర్‌పై వున్న పసిపాపను స్ట్రెచర్‌తోపాటు దాదాపు పరుగెత్తుతూ తీసుకెళ్ళారు. వెనకే సెలైన్ బాటిల్ పట్టుకొని ఒకరు, ఆక్సిజన్ సిలిండర్ పట్టుకొని మరొకరు ఫాలో అయ్యారు. అందరి వెనుక ఓ పాతికేళ్ళ అమ్మాయి ఆదుర్దాగా వాళ్ళ వెంట లోపలికి వెళ్ళింది. మెరూన్ రంగు చుడీదార్ ధరించి ఉంది ఆ అమ్మాయి.



మనిషి చామనచాయ రంగులో వున్నా చక్కని కనుముక్కు తీరుతో చాలా అందంగా వుంది.



తిరుపతిలో మంచి పేరున్న ఆసుపత్రి అది. సమయం రాత్రి ఎనిమిది దాటినా మనుషులు అటూయిటూ తిరుగుతూనే వున్నారు. ఎమర్జన్సీ వార్డు దగ్గర మరింత జనం వున్నారు. లోపల ట్రీట్‌మెంట్ పొందుతున్న తమ తాలూకు మనుషుల క్షేమం గురించిన ఆదుర్దా వాళ్ళ మొఖాల్లో కనిపిస్తోంది.

అరగంట తర్వాత పసిపాపతో లోపలికి వెళ్ళినవాళ్ళందరూ బయటకు వచ్చారు స్ట్రెచర్ తోసుకుంటూ. స్ట్రెచర్‌పై వున్న పాపకు ఆక్సిజన్, సెలైన్ ట్యూబులు తొలగించబడి వున్నాయి. వస్తున్న వాళ్ళలో అంతవరకూ వున్న టెన్షన్, భయం లేవు. ఏడుపు, బాధ వుంది. చివరగా ఆ అమ్మాయి వచ్చింది. ఆమె ముఖం విచారంగా వుంది.

అందరూ అంబులెన్స్‌లో ఎక్కారు ఆ అమ్మాయి తప్ప. ఆ అమ్మాయి అంబులెన్స్‌లో కూర్చున్న వాళ్ళతో ఏదో చెప్పింది. అంబులెన్స్ కదిలింది. ఆ పాప తల్లి రోదన క్రమక్రమంగా దూరమవసాగింది.

ఆ అమ్మాయి తను నిలబడినచోటు నుండి కదలలేదు. అరగంట గడిచింది. ఆ అమ్మాయి అక్కడే అలాగే నిలబడి వుంది. ఆమె ముఖంలో విచారం తగ్గలేదు.

కొంతసేపటికి ఆమె వద్దకు ఒకతను వచ్చాడు. ముప్ఫై ఏళ్ళు దాటి వుంటాయి అతనికి. తెల్లని ప్యాంటుపై ఎర్రని టీ షర్టు ధరించి వున్నాడు.

''శ్రీకాళహస్తి నుంచి వచ్చిన డాక్టరు మీరేనా?'' అని అడిగాడు ఆమెని.

ఆమె అవునన్నట్లు తలూపి ఆసక్తిగా చూసింది అతనేం చెబుతాడో వినాలని.

''నేను ఈ హాస్పిటల్‌లో పనిచేస్తున్నాను'' అన్నాడు.

''మీరూ డాక్టరా?''

''కాదు. అడ్మినిస్ట్రేషన్ సైడ్. ఆ పాపకు మొదట ట్రీట్ చేసింది మీరేనా?''

''అవును. నేనే ఆపరేషన్ చేశాను. అయితే చాలా ఆలస్యంగా తీసుకొచ్చారు నా దగ్గరకు. పరిస్థితి చాలా క్రిటికల్‌గా వుండింది. ఆ పాపకు ఏదైనా అయితే నన్ను బాధ్యురాల్ని చేస్తారేమోనన్న భయం నాకున్నా, అంతకన్నా ముందు ఆ పాపను బ్రతికించడానికి మనిషిగా నా ప్రయత్నం చేయాలన్న తపనతో ఆపరేషన్ చేయడానికి ఒప్పుకొన్నాను. కాని పరిస్థితి మరింత దిగజారింది ఆపరేషన్ చేశాక. ఇక ఆశ లేదని, యిక్కడకు పిలుచుకువచ్చినా ఫలితం వుండదని నేను చెప్పాను. అయినా తల్లి కాబట్టి బిడ్డ బ్రతుకుతుందేమో అన్న ఆశతో యిక్కడికి తెచ్చారు. ఫలితం దక్కలేదు''.

ఆమె ఎవరితోనైనా తన మనసు విప్పి చెప్పుకోవడానికే ఎదురు చూస్తున్నట్లు అతను అడగగానే గబగబా జరిగిందంతా చెప్పింది.

''అవును. హాస్పిటల్‌లోనూ డాక్టర్లు అదే అనుకొంటున్నారు. మీరు వయసులో చిన్నవారైనా ఆ పాప ప్రాణం కాపాడటంకోసం రిస్కు తీసుకొని ఆపరేషన్ చేశారని, మరో డాక్టర్ అయితే అసలు అడ్మిట్ కూడా చేసుకొనేవారు కారని మిమ్మల్ని మెచ్చుకొన్నారు'' అన్నాడు అతను.

ఆమె కళ్ళల్లో ఒక్క క్షణం పాటు వెలుగు కనిపించింది అతనికి.

''మీరెందుకు వాళ్ళతోపాటు వెళ్ళలేదు'' అని అడిగాడు ఆమెని.

''ధైర్యంలేక. వాళ్ళు పెద్దగా చదువుకొన్నవాళ్ళు కాదు. గొడవలు చేసేరకం కూడా. వాళ్ళ పాపను నేనే చంపేశానని అంటారేమోనన్న భయం నాకుంది. అందుకే వాళ్ళతో వెళ్ళలేదు. పైగా యీ విషయం విని ఊరివాళ్ళంతా నన్ను ఓ హంతకురాలిని చూసినట్లు చూస్తారేమోనన్న భయం మరోవైపు. అందుకే యిక ఆ ఊరికి వెళ్ళాలని లేదు నాకు''.

''వెళ్ళక ఏం చేస్తారు? ఎన్నాళ్లు వెళ్ళకుండా వుండగలరు?''

''అవేవీ ఆలోచించడం లేదు నేను. ఏం చేయాలో తోచడం లేదు'' అంది కళ్ళనీళ్ళతో.

''మీరు యింత సెన్సిటివ్ అయితే డాక్టరు వృత్తి ఎలా చేయగలరు? పదండి. అలా వెళ్ళి కాఫీ తాగొద్దాం''

''నాకిప్పుడు తాగాలని లేదు''

''ఫర్వాలేదు రండి. ఎప్పుడు తిన్నారో ఏమో. అద్దంలో ఒకసారి మీ మొఖం చూసుకున్నారంటే మీరెంత అలసిపోయి వున్నారో తెలుస్తుంది. పదండి. ఎదురుగా మంచి హోటల్ వుంది'' అంటూ కదిలాడు.

ఆమె మరేం మాట్లాడకుండా అతన్ని అనుసరించింది.

హోటల్‌లో ఖాళీ టేబుల్ ముందు ఎదురెదురుగా కూర్చున్నారు. అతడు సర్వర్‌ని పిలిచి రెండు ప్లేట్లు చపాతీలు, తర్వాత కాఫీలు తెమ్మని చెప్పాడు. తర్వాత ఆమెవైపు తిరిగి,

''మీరు ప్రాక్టీస్ పెట్టి ఎన్నేళ్ళయింది'' అని అడిగాడు.

''రెండేళ్ళు''

''మరి కొత్తగా ప్రాక్టీసు పెట్టిన డాక్టరులా అంత భయపడుతున్నారేమిటి?''

''ఇది నా ఫస్ట్ ఫెయిల్యూర్ కేస్. పైగా నేను సర్జరీ చేసిన మొదటి కేసు. ఆ పాప తాలూకు మను

## ప్రియాంక బర్త్‌డే గొడవ

**అ**క్షయ్ కుమార్‌తో ప్రియాంక చోప్రా చెట్టపట్టాల్ ఎక్కువై శృతిమించేసరికి ట్వింకిల్ ఖన్నా కారాలు మిరియాలు నూరుతోందట. ఈమధ్య ప్రియాంక బర్త్‌డే జరిగితే హడావుడి అంతా అక్షయ్‌దేనట. అయితే ఈ పార్టీకి ట్వింకిల్‌కి మాత్రం ఆహ్వానం అందలేదు. ఇంటికొచ్చేసరికి అక్షయ్‌పై ట్వింకిల్ యుద్ధం ప్రకటించించేసింది. ప్రియాంక మాత్రం అందర్నీ ఆహ్వానించినట్టే అక్షయ్‌ని కూడా ఆహ్వానించాను. ఇందులో గుసగుసలు పోవాల్సింది ఏమీలేదు అంటోంది. మరి ట్వింకిల్‌ను ఎందుకు పిలవలేదో. *(ట్వింకిల్ అందరిలాంటి అమ్మాయి కాదుగదా!)*

షులు బాగా డబ్బున్నవాళ్ళు. ఎంత మంచివాళ్ళో అంత మూర్ఖులు కూడా. వాళ్ళు యీపాటికి నా క్లినిక్‌పై దాడి చేసి వున్నా ఆశ్చర్యపోనక్కరలేదు'' ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళలో భయం కనిపించింది అతనికి.

''మీరు అన్నీ నెగిటివ్‌గానే ఎందుకు ఆలోచిస్తారు? పాజిటివ్‌గా ఆలోచించడం అలవాటు చేసుకోండి''.

కాఫీ తాగాక ఆమె వద్దంటున్నా వినకుండా తనే బిల్లు చెల్లించాడు అతను. కడుపులో ఆహారం పడేసరికి అంతవరకూ వున్న నీరసం మాయమైంది ఆమెలో.

''మీ అమ్మానాన్నలు మీతో వుండడం లేదా?'' హోటల్ బయటకొచ్చాక అడిగాడు అతడు.

''వాళ్ళు శ్రీకాళహస్తి దగ్గర్లోని ఓ పల్లెలో వుంటున్నారు. నేను ఒంటరిగానే వుంటున్నాను. నా క్లినిక్‌లో పనిచేసే జలజ అనే అమ్మాయి నాతోపాటు మా యింట్లోనే వుంటుంది.

''నేను మీకో సలహా యిస్తాను. వింటారా?''

''చెప్పండి''

''మీరు వెంటనే బయలుదేరి మీ ఊరు వెళ్ళిపోండి. పదిన్నర అవుతోంది టైము ఇప్పుడు. మీరు ఊరు చేరేసరికి పన్నెండు అవుతుంది. ఇంటికెళ్ళి ఏమీ ఆలోచించకుండా నిద్రపోండి. రేపు ఉదయం నిద్రలేచాక అంతా నార్మల్‌గా అనిపిస్తుంది మీకు. ఈరోజు మీరు అనుభవించిన టెన్షన్, భయం, బాధ ఏవీ వుండవు.

ఆమె ఒక్కక్షణం ఆలోచించి అలాగేనన్నట్టు తలూపింది.

ఇద్దరూ ఆటోస్టాండ్ వైపు నడిచారు. ''మీరు 'డేల్ కార్నేగి' రాసిన 'హౌటు స్టాప్ వర్రీయింగ్ అండ్ స్టార్ట్ లివింగ్' పుస్తకాన్ని చదివారా?'' అని ఆమెను అడిగాడు.

''లేదు''

అతను తన చేతిలోని పుస్తకాన్ని ఆమెకిచ్చాడు.

''చదవండి. మీకు చాలా ఉపయోగపడుతుంది. ఇది నా దృష్టిలో ఓ భగవద్గీత. వీలున్నప్పుడల్లా చదువుతుంటాను నేను.''

''మరి మీకు తిరిగి ఎలా యివ్వను?''

''ఆ పుస్తకం చివర నా చిరునామా వుంది. మీరు చదవడం పూర్తయ్యాక ఆ అడ్రసుకు కొరియర్‌లో పంపించండి''.

''థాంక్యూ'' అంది కృతజ్ఞతగా.

పుస్తకం చివర అతని పేరు 'ప్రభాకర్' అని రాసి వుండడం వీధి దీపాల వెలుగులో చూసి 'నా పేరు భవాని' అంటూ హేండ్‌బ్యాగు నుంచి తన విజిటింగ్ కార్డు తీసి అతనికిచ్చింది.

ఆమె ఆటోలో కూర్చున్నాక అతను వంగి లోపలికి చూస్తూ ''బీ బ్రేవ్. అంతా నార్మల్‌గానే వుంటుంది. గాడ్ బ్లెస్ యూ'' అన్నాడు.

ఆమె అతని చేతిని అందుకుని, అతని ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా, ''థాంక్యూ, థాంక్యూ ఫ్రెండ్'' అంది కరచాలనం చేస్తూ.

ఆటో కదిలింది.

* * *

బస్‌స్టేషన్ వెలుపల భవాని ఆటో దిగగానే శ్రీకాళహస్తి వెళ్ళే బస్సు బయటకు వస్తూ కనిపించింది. వెంటనే బస్సుని ఆపి ఎక్కింది. సీటులో కూర్చున్నాక 'తను క్లినిక్‌కు ఫోన్ చేసి జలజను బస్‌స్టేషన్‌కు రమ్మని చెప్పి ఉండాల్సింది. తను ఊరు చేరేటప్పటికి అర్ధరాత్రి అవుతుంది కదా' అనుకొంది.

శ్రీకాళహస్తిలో బస్ దిగిన భవానికి ఎదురుగా ఆమె క్లినిక్‌లో పనిచేసే జలజ, రాజన్‌లు కనిపించారు.

''ఇదేమిటి. ఈ టైములో మీరిక్కడ?'' అని అడిగింది భయంగా చూస్తూ.

''మేమిద్దరం మీకోసం ఎదురుచూస్తూ క్లినిక్‌లోనే వుండిపోయాం. ఇంతలో మీ ఫ్రెండు ఒకరు ఫోన్ చేసి మీరు తిరుపతి నుంచి బయలుదేరారని, పన్నెండు గంటలకు ఊరు చేరవచ్చునని, మిమ్మల్ని యింటి దగ్గర దిగబెట్టమని చెప్పారు'' అన్నాడు రాజన్.

''పేరు ఏం చెప్పారు?''

''ప్రభాకర్ అని చెప్పారు''

ఆమెకు తను ప్రభాకర్‌కు విజిటింగ్ కార్డు యివ్వడం గుర్తొచ్చింది. అందులోని తన ఫోన్ నెంబరు చూసి క్లినిక్‌కు ఫోన్ చేశాడులా వుంది. 'హి యీజ్ ఎ మేన్ ఆఫ్ కన్సర్న్' అనుకొంది మనసులో.

ఇంటికెళ్ళి భోజనం చేసి పడుకొంది. ఆమె మనసులో యిప్పుడు చనిపోయిన పాప గురించిన ఆలోచనలు లేవు. ప్రభాకర్ గురించే ఆలోచిస్తోంది.

'ప్రపంచంలో యింకా మానవత్వం వుంది. ఎదుటి మనిషి గురించి పట్టించుకొనేవాళ్ళు, కన్నీరు తుడవడానికి ప్రయత్నించేవాళ్ళు యింకా వున్నారు'' అనుకొంది.

కొద్దిసేపటికే అలసిన ఆమె శరీరానికి నిద్ర పట్టింది.

* * *

మరుసటిరోజు ఆదివారం కనుక ఆలస్యంగా నిద్ర లేచింది భవాని. 'ప్రభాకర్ చెప్పినట్లే ముందు రోజు వుండిన భయం, అలసట యిప్పుడు లేవు' అనుకుంది. స్నానం చేసి క్లినిక్‌కు వెళ్ళింది. ఆమె ఊహించినట్లు ఆమె క్లినిక్‌పై ఎవరూ దాడి చేయలేదు. పాప తాలూకు బంధువులు వచ్చి 'ఆమె ప్రయత్నం ఆమె ధైర్యంగా చేసిందని, తమకు ప్రాప్తం లేకపోవడం వల్లే పాప తమకు దక్కలేదని, బాధపడవద్దని' చెప్పి వెళ్ళారు.

సాయంత్రం క్లినిక్‌కు శెలవు కాబట్టి ప్రభాకర్ యిచ్చిన పుస్తకాన్ని చదవడం మొదలుపెట్టింది. రెండు రోజుల్లో పుస్తకాన్ని పూర్తి చేసింది. ఆ పుస్తకం ఆమెకెంతో నచ్చింది. ఆ పుస్తకాన్ని తనకు యిచ్చి చదవమని ప్రోత్సహించిన ప్రభాకర్‌కు మనసులోనే ధన్యవాదాలు చెప్పుకొంది. ఆ పుస్తకం కాపీ ఒకటి తన దగ్గరుంటే మంచిదని భావించి పబ్లిషర్స్ అడ్రసు నోట్ చేసుకొంది. 'రేపే వాళ్ళకు ఉత్తరం రాయాలి' అనుకొంది.

మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు ప్రభాకర్ యిచ్చిన పుస్తకంలోని అతని ఫోన్ నెంబరు చూసి డయల్ చేసింది.

''హలో ప్రభాకర్ గారి యిల్లేనా?!'' ఫోనులో ఆడగొంతు విని అడిగింది.

''అవునండీ. ఆయన భార్యను మాట్లాడుతున్నాను. మీరు?''

''శ్రీకాళహస్తి నుంచి డాక్టర్ భవాని''

''అలాగా. ఆయన హాస్పిటల్‌కు వెళ్ళారు''

''అప్పుడే డ్యూటీకి వెళ్ళిపోయారా?''

''ఆయన పనిచేసేది ఇంజనీరింగ్ కాలేజీలో. వారి తల్లిగారు హాస్పిటల్‌లో అడ్మిట్ అయి వుండడంతో రోజు వెళ్ళి చూసుకునేవారు. ఆవిడ తెల్లవారు ఝామున పోయారు. బాడీ తీసుకురావడానికి వెళ్ళారు''.

నోట మాట రానట్టు నిలబడిపోయింది భవాని. వెంటనే తేరుకుని

''ఐయామ్ సారీ. ఎలా పోయారు ఆవిడ'' అని అడిగింది.

''ఆస్తమా పేషెంట్ ఆవిడ. వారం రోజులుగా హాస్పిటల్‌లోనే వుంది. శనివారం సాయంత్రం నుంచి కోమాలోకి వెళ్ళిపోయింది.''

''ప్రభాకర్ గారికి నా కండొలెన్సస్ చెప్పండి. నేను తర్వాత ఫోన్ చేస్తాను'' అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

అయితే ప్రభాకర్ ఆ హాస్పిటల్‌లో పనిచేయడం లేదు. తల్లి కోమాలోకి వెళితే ఏం చేయాలో తోచక బాధపడుతూ హాస్పిటల్‌లో అటూయిటూ తిరుగుతూ, బాధపడుతూ నిలబడివున్న తనని చూశాడు. జరిగింది తెలుసుకొని తనతో మాట్లాడటంకోసం హాస్పిటల్ స్టాఫ్ అని అబద్ధం చెప్పాడు. అక్కడి డాక్టర్లు తన గురించి గొప్పగా మాట్లాడుకొంటున్నారని మరో అబద్ధం చెప్పాడు. అలా చెబితే తనకు ఊరట కలుగుతుందని, ధైర్యం వస్తుందని ఎంతో గొప్పగా ఆలోచించి చెప్పాడు. నిజంగానే ఆ మాట తనకెంతో ధైర్యాన్నిచ్చింది.

పైగా శనివారం సాయంత్రం నుంచి అతని తల్లి కోమాలోకి వెళ్ళిపోయింది. ఆ సమయంలో అతని మానసిక పరిస్థితి ఎలా వుంటుందో తను అర్థం చేసుకోగలదు. కాని అతను తనను కలిసిందీ, ధైర్యం చెప్పింది ఆ శనివారం రోజు రాత్రే. మనసులో అంతటి బాధను వుంచుకొని కూడా మరో మనిషిని పట్టించుకుని, ధైర్యం చెప్పిన అతని 'మనిషి తనానికి' ఆమె మనసులోనే జోహార్లు అర్పించింది.

'ఆరోజు బాధలో వున్న తనకు అండగా వుండి ధైర్యం చెప్పిన అతను యీరోజు బాధలో వున్నాడు. అతనికి ధైర్యం చెప్పడం యిప్పుడు తన బాధ్యత. మనిషి సుఖాలలో వున్నప్పటికంటే బాధల్లో వున్నప్పుడే ఆప్తుల తోడు, ఓదార్పు అవసరం' అనుకొని తిరుపతి వెళ్ళడానికి నిశ్చయించుకుని సిద్ధమవసాగింది డాక్టర్ భవాని.

**శనివారం సాయంత్రం నుంచి అతని తల్లి కోమాలోకి వెళ్ళిపోయింది. ఆ సమయంలో అతని మానసిక పరిస్థితి ఎలా వుంటుందో తను అర్థం చేసుకోగలదు. కాని అతను తనను కలిసిందీ, ధైర్యం చెప్పింది ఆ శనివారం రోజు రాత్రే. మనసులో అంతటి బాధను వుంచుకొని కూడా మరో మనిషిని పట్టించుకుని, ధైర్యం చెప్పిన అతని 'మనిషి తనానికి' ఆమె మనసులోనే జోహార్లు అర్పించింది.**